

ఆలయదర్శనం
– పి.ఎస్.ఎం.లక్ష్మి



## 20

# శ్రీ విద్యా సరస్వతీ, శ్రీ శనైశ్వర దేవాలయం, వర్గల్, మెదక్ జిల్లా

భారత దేశంలో సరస్వతీ దేవికి ఆలయాలు చాలా తక్కువగా వున్నాయి. విజ్ఞానదాయిని, జ్ఞాన ప్రదాయిని అయిన శ్రీ సరస్వతీ దేవిని ప్రతి ఒక్కరూ కొలుస్తారు. ముఖ్యంగా విద్యార్ధులు పూజించే ఈ తల్లికి మెదక్ జిల్లాలో వున్న ఈ సరస్వతీ దేవి ఆలయం ఎంత ప్రసిద్ధి పొందిందంటే వర్గల్ అంటే సరస్వతీ దేవి ఆలయం అనేంత.

ఈ ఆలయ నిర్మాణం 1989లో ప్రారంభింపబడి, 1992లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా నృసింహ భారతీ స్వామి వారిచే సరస్వతీ విగ్రహం ప్రతిష్ఠించబడింది. తర్వాత కంచి కామకోటి పీఠంవారికి అనుసంధానింపబడింది. వారి ఆధ్వర్యంలో 1999లో వేద పాఠశాల, 2001లో లక్ష్మీ గణపతి ఆలయాలు ప్రారంభమైనాయి.

ప్రశాంతమైన వాతావరణంలో విలసిల్లో ఈ ఆలయ గర్భగుడిలో విద్యా సరస్వతీ దేవిని ఒకసారి దర్శిస్తే అలాగే చూస్తూవుండిపోతాము. అంత అద్భుతమైన దేవి.

హైదరాబాదుకు సమీపంలో వుండటంతో శని, ఆదివారాలలో, పర్వ దినాలలో ఇక్కడ భక్తుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. తమ బిడ్డల విద్యాభివృద్ధికోసం అమ్మవారికి పూజలు చేయించేవారు, తమ చిన్నారుల అక్షరాభ్యాసం జరిపించేవారు ఎక్కువగా వస్తూవుంటారు.

ఈ ఆలయంలో భక్తుల సౌకర్యార్ధం సకల ఏర్పాట్లు చేయబడ్డాయి. మెట్లు ఎక్కలేనివారికోసం లిఫ్ట్ ఏర్పాటు చేయబడ్డది. ప్రతి రోజూ వచ్చే భక్తులందరికీ మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేయబడుతోంది. దీనికోసం మధ్యాహ్నం 12 గం. లలోపు సరస్వతీ ఆలయంలో టోకెన్లు తీసుకోవాలి.

శివాలయం

శ్రీ విద్యా సరస్వతి ఆలయంగా దినదిన ప్రవర్ధమానమవుతున్న ఈ ఆలయం వున్న గుట్ట పక్కనే అతి పురాతనమైన శంభు దేవుడి (శివుడు) ఆలయం వున్నది. ఇందులో శివ లింగానికి పక్కనే అతి చిన్న నీటి కుంట. దీనిలో నీరు తాగితే సకల వ్యాధులు నయమవుతాయని నమ్మకంతో అక్కడికి వచ్చిన వారంతా ఆ నీటిని సేవించేవారు. దాని పక్కనే పాక్కుంటూ వెళ్తే 4, 5 గురు కూర్చోగలిగిన విశాలమైన ప్రదేశం. పూర్వం అక్కడ మునులు తపస్సు చేసుకునేవారంటారు.

కానీ సరస్వతీ దేవి ఆలయం పునర్నిర్మింపబడిన సందర్భంలో అమ్మవారి ఆలయంలోనేకాక ఈ శివాలయంలోనూ అనేక మార్పులు చెయ్యబడ్డాయి. ప్రస్తుతం ఈ శివాలయంలో ఈ ప్రదేశం కనబడకపోవచ్చు.

శ్రీ శనైశ్చరాలయం

సరస్వతీ దేవి ఆలయం వున్న గుట్ట దిగువనే శ్రీ శనైశ్చరాలయం వున్నది. భక్తులు ఇక్కడ శనీశ్వరునికి పూజలు చేస్తారు.

ఆలయం బయట ఉద్యానవనం, దానిలో ఆకర్శణీయమైన విగ్రహాలు, భక్తుల మనసులను ఆహ్లాద పరుస్తాయి.

**శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, రత్నగిరి**

కరీంనగర్ మార్గంలో వర్గల్ కి వెళ్ళే దోవలో, షామీర్ పేట దాటాక వున్న ఈ ఆలయం కూడా నూతనంగా నిర్మింపబడినదే. పలు ఉపాలయాలతో, చక్కని ఉద్యానవనాలు – వాటి మధ్య ఆకర్షణీయమైన విగ్రహాలతో – కొంత సమయం ప్రశాంతంగా గడపటానికి చక్కని ప్రదేశం.

**శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, క్షేత్రగిరి, మెదక్ జిల్లా**

చిన్న గుట్టమీద వున్న ఈ ఆలయంకూడా పురాతనమైనదే. గర్భగుడిలోకి చొచ్చుకువచ్చిన కొండమీద ఉబ్బెత్తుగా ఆవిర్భవించిన ఆకారం శ్రీ వెంకటేశ్వరస్వామి స్వయంభూ రూపంగా భావించి నిత్య పూజలు జరుపుతున్నారు. ఎదురుగా వున్న కొండ గుహలో వీరభద్రస్వామి విగ్రహం వున్నది. పక్కన వున్న గుహలో శివలింగం వుంటుంది. అక్కడికి వెళ్ళటానికి బాగా వంగి లోపలకి వెళ్ళాలి. లోపలకి వెళ్ళాక ఎంత పొడుగు మనిషి నుంచున్నా తలపైన ఇంకో జానెడు ఎత్తులో ఆ రాతి కప్పు వుంటుంది. అక్కడే నవ గ్రహాలకు, భార్యలతో సహా వేరు వేరు చిన్న ఆలయాలున్నాయి. అయితే ఈ మధ్య ఇక్కడ పూజలు జరుగుతున్నట్లు లేదు.

**మార్గము**

హైదరాబాద్ – కరీంనగర్ రోడ్డులో రత్నగిరి తర్వాత మేడ్చల్ వెళ్ళే దోవలో 2 కి.మీ.ల దూరంలో వున్నది.

COMMENTS